సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 28 । జనవరి । 2024



కిక్‌బాక్సింగ్‌లో ప్రతిభ

సిరిసిల్లకల్చరల్: కిక్ బాక్సింగ్‌లో జిల్లాకు చెందిన గంగనవేణి ప్రవల్లిక, దానరి రశ్మిత ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరిని ఎస్పీ అఖిల్‌మహాజన్ అభినందించారు.



జోనల్ స్పోర్ట్స్ హంగామా

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల మినీస్టేడియంలో శనివారం శ్రీచైతన్య ఈటెక్నో జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. పోటీల్లోని విజేతలకు బహుమతులు అందించారు.

గరిష్ఠం/కనిష్ఠం
29.0/16.0

వాతావరణం

ఆకాశం మేఘావృతం అవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

గోదావరి జలాలకు పూజలు



గోదావరి జలాలకు పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): యాసంగి సాగులో రైతులు ఇబ్బందులు పడకూడదని రాష్ట్ర ప్రభుత్వం మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను విడుదల చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం మద్దికుంట వద్ద గోదావరి జలాలకు శనివారం పూజలు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఈఎన్సీ హరేరామ్‌తో మాట్లాడి మల్లన్నసాగర్ నీటిని విడుదల చేయించారన్నారు. మోహినికుంట, మద్దికుంట, ముస్తాబాద్, చీకోడు, గూడెం, ఆవునూర్ చెరువులను గోదావరి జలాలతో నింపుతామన్నారు. ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గజ్జెల రాజు, దేవేందర్, రమేశ్, తలారి నర్సయ్య, మహేందర్‌రెడ్డి, సత్తయ్య, ఆంజనేయులు, నరేశ్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పెనం మడుగుకు గండి



గండిని పూడ్చివేస్తున్న సింగారం రైతులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని సింగారం శివారులోని పెనంమడుగు కాలువకు గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట రైతులు దొంగచాటుగా గండి కొట్టారు. పెనం మడుగు నుంచి పెద్ద రామగుండం, చిన్న రామగుండం ద్వారా సింగారం చెరువులోకి వచ్చే నీళ్లను మళ్లించేందుకు ఈ గండి కొట్టినట్లు సింగారం రైతులు అన్నారు. అప్రమత్తమైన సింగారం రైతులు పెనం మడుగు గండిని రాళ్లతో మూసివేశారు. గండి కొట్టిన మల్లారెడ్డిపేట రైతులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రామచంద్రంకు ఫిర్యాదు చేశారు. సింగారం మైసమ్మ చెరువు చైర్మన్ రాయిని దేవయ్య, వైస్‌చైర్మన్ యాద శ్రీనివాస్, యాద మల్లేశం, గోనె నాగరాజు, ముత్యాల యాదగిరి, మహబూబ్, యూసఫ్, భూమయ్య ఉన్నారు.

రామప్ప జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ కళ

సిరిసిల్ల: మధ్యమానేరు జలాశయం శివారులోని రామప్ప వద్ద జరిగే శ్రీరామలింగేశ్వర స్వామి జాతర పోస్టర్‌ను సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి శనివారం ఆవిష్కరించారు. ఫిబ్రవరి 9న మాఘ అమావాస్య రోజున రామప్ప జాతర జరుగుతుంది. నాయీబ్రాహ్మణ సంఘం, భక్త బృందం అధ్యక్షుడు చింతకుంట శ్రీనివాస్, సంఘం పెద్దలు చింతకుంట వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త బంద్‌కు సహకరించండి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

సిరిసిల్లకల్చరల్: దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16న తలపెట్టిన బంద్‌కు ప్రజలు సహకరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు కోరారు. సుభాష్‌నగర్‌లోని కార్మికభవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో బంద్‌కు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రం అనుసరిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్లు బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఐఎన్‌టీయూసీ నాయకులు గోనె ఎల్లప్ప, ఎగమంటి మల్లారెడ్డి, ఎలిగేటి రాజశేఖర్, పంతం రవి, మీసం లక్ష్మణ్, సోమ నాగరాజు, ఎడపెల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అడవి దాటేదెలా ?

- రహదారులకు అడవే అడ్డు
- అటవీశాఖ అనుమతిస్తేనే రోడ్ల నిర్మాణాలు
- నిధులున్నా ముందుకుసాగని పనులు
- తీరని పల్లె ప్రజల రవాణా కష్టాలు



ఇది తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల నుంచి ఇందిరానగర్ మీదుగా.. ముస్తాబాద్‌కు వెళ్లే రోడ్డు. జిల్లెల్ల ఎక్స్ రోడ్డు నుంచి 13 కిలోమీటర్లు డబుల్ రోడ్డు నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ ద్వారా రూ.28 కోట్లు మంజూరయ్యాయి. తంగళ్లపల్లి–ముస్తాబాద్ మండలాల మధ్య డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. కానీ ఇందిరానగర్ శివారులో అటవీశాఖ భూమిలో నుంచి రోడ్డు నిర్మించాల్సి ఉంది. రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ నుంచి అనుమతి రాకపోవడంతో ఈ డబుల్ రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఫలితంగా ఈ మార్గంలో వాహనదారులు, ప్రజలు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు.



నెత్తిన మూటలు.. భుజాన చిన్నపిల్లలు, చేతిలో కర్రతో వస్తున్న వీరు మానాల శివారులోని గిరిజన తండాలకు చెందిన వారు. రోడ్డు లేక అటవీమార్గంలో కాలిబాటన వెళ్తున్నారు. మానాల, గర్జనపల్లి, రంగంపేట, మద్దిమల్ల, వస్‌పల్లి గిరిజన తండాల మధ్య కుటుంబ బాంధవ్యాలు ఎక్కువ. దీంతో ఈ అటవీమార్గంలో వివిధ పనుల కోసం వచ్చి వెళ్లడం అనివార్యమైంది. ఆరు కిలోమీటర్లు కాలినడకన ఇలా వెళ్తేనే ఏదో ఒక్క వాహన సౌకర్యం ఉంటుంది. లేదంటే 60 కిలోమీటర్లు తిరిగి రావాల్సి ఉంటుంది. 20 గిరిజన పల్లెలకు ఎంతో ముఖ్యమైన మానాల–మరిమడ్ల రోడ్డును నిర్మించేందుకు పాలకులు ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేరక ఇలా గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు.



ఇది జిల్లాలోని రుద్రంగి మండలం మానాల గిరిజన తండాల నుంచి కోనరావుపేట మండలం మరిమడ్లకు వెళ్లే మట్టి రోడ్డు. ఆరు కిలోమీటర్ల రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఆర్‌అండ్‌బీ ద్వారా రూ.9 కోట్లు మంజూరయ్యాయి. ఈ రోడ్డు పూర్తిగా అటవీ మార్గంలోనే ఉండడంతో స్టేజీ–1 ఆమోదం పొందింది. అటవీశాఖకు రూ.2.70 కోట్లను ఆర్‌అండ్‌బీ శాఖ చెల్లించింది. స్టేజీ–2 పనులకు అటవీశాఖ నుంచి ఆమోదం రావాల్సి ఉంది. కానీ అనుమతి రాక రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఇలా జిల్లాలో నిధులున్నా అటవీశాఖ అనుమతులు లభించక రోడ్డు పనులు ఆగిపోయాయి.

సిరిసిల్ల: అటవీశాఖ అనుమతి లేక రోడ్ల నిర్మాణాలు జరగడం లేదు. ఆర్‌అండ్‌బీ, అటవీశాఖలను సమన్వయం చేసి, రోడ్ల పనులు చేయించాల్సి ఉంది. పాలకులకు పట్టింపు లేక జిల్లాలోని ప్రధాన రహదారుల నిర్మాణాలు నిలిచిపోయాయి. ప్రభుత్వంలోని రెండు శాఖలను సమన్వయం చేసి, రోడ్డు నిర్మాణాలను పూర్తి చేయించాల్సిన నేతలు, అధికారులకు ఆ సమయం, ఓపికా లేక ఇలా పల్లె ప్రజలు అడవిని దాటలేకపోతున్నారు.

ఏళ్లుగా దరి చేరని రవాణా సౌకర్యం

రాజన్నసిరిసిల్ల జిల్లా సరిహద్దు మండలాల ప్రజలకు ఇతర జిల్లాలకు వెళ్లాలంటే రవాణా కష్టాలు అన్నీ.. ఇన్నీ కావు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా మధ్యలో రెండు, మూడు కిలోమీటర్ల దూరం విస్తరించి ఉన్న అడవిలో నుంచి రోడ్డు వేసేందుకు అనుమతులు లేక ఆ మార్గాలు పూర్తి కావడం లేదు. ఫలితంగా అడవిని దాటేందుకు ఏళ్లుగా ఎదురుచూపులు తప్పడం లేదు. రుద్రంగి మండలం మానాల నుంచి నిజామాబాద్ జిల్లాకు, చందుర్తి మండల కేంద్రం నుంచి జగిత్యాల జిల్లా భీమారం, తంగళ్లపల్లి మండలం ఇందిరానగర్ నుంచి ముస్తాబాద్ వెళ్లాలంటే మధ్యలో అటవీశాఖ భూములు విస్తరించి ఉన్నాయి. ఆయా భూముల నుంచి రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు లభించక ఏళ్లుగా ఆ రోడ్డు పనులు పూర్తి కావడం లేదు. ఫలితంగా కాలిబాటే దిక్కవుతుంది. అటవీగుండా నడుచుకుంటూ భయం.. భయంగా వెళ్తున్నారు. దొంగలు, అటవీ జంతువుల నుంచి ప్రాణభయం ఉంటుందనే ఆందోళనతోనే అటవీని దాటేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఆయా ప్రాంతాల్లో రోడ్లు పూర్తి చేస్తే తమ కష్టాలు తీరుతాయని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు పట్టించుకొని తమ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



ఇది చందుర్తి మండల కేంద్రం నుంచి జగిత్యాల జిల్లా భీమారం మండలం మోత్కురావుపేటకు వెళ్లే మట్టి రోడ్డు. 13 కిలోమీటర్ల ఈ రోడ్డుతో రాజన్నసిరిసిల్ల–జగిత్యాల జిల్లాల మధ్య దూరభారం తగ్గుతుంది. ఇప్పటికే 9.5 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తయింది. ఇంకా 3.5 కిలోమీటర్ల రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.19.75 కోట్లు మంజూరయ్యాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టగా.. అటవీశాఖ అనుమతి లేక 3.5 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఫలితంగా ఆ పరిధిలోని ఒర్రెలపై కల్వర్టులు, వంతెనల నిర్మాణాలు లేక వాహనాల రాకపోకలు సాధ్యం కావడం లేదు. అటవీశాఖ అనుమతిస్తే.. ఈ రోడ్డు పూర్తవుతుంది.

జిల్లాలో ఆర్‌అండ్‌బీ రోడ్ల స్వరూపం

సిమెంట్	31.46 కిలోమీటర్లు
తారు(బీటీ)	538.26 కిలోమీటర్లు
కంకర(మెటల్)	0 కిలోమీటర్లు
మట్టి	8.95 కిలోమీటర్లు
మొత్తం రోడ్ల పొడవు	578.67 కిలోమీటర్లు

రోడ్డు లేక ఇబ్బందులు



జిల్లెల్ల–ముస్తాబాద్ రోడ్డు నిర్మాణం ఆగిపోయింది. రోడ్డు లేక మా ఇందిరానగర్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎటు వెళ్లాలన్నా రోడ్డు సౌకర్యం సరిగ్గా లేదు. అటవీశాఖ అనుమతి తీసుకుని వెంటనే ఈ రోడ్డు వేయాలి. ఇది పూర్తయితే రవాణా కష్టాలు తీరుతాయి.

– పిట్ల నాగరాజు, సర్పంచ్, ఇందిరానగర్

మానాల-మరిమడ్ల రోడ్డుతో ఎంతో మేలు



మేము ఈ రోడ్డు కోసం మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నాం. మానాల–మరిమడ్ల రోడ్డు పూర్తయితే గిరిజన తండాల వాసులకు ఎంతో మేలు జరుగుతుంది. రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల కిందటే నిధులు మంజూరయ్యాయి. కానీ ఈ రోడ్డు పని పూర్తికాలేదు. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలి.

– గుగులోత్ మోహన్, వీరునితండా, మానాల

మధ్యలో ఆగింది



మోత్కురావుపేటకు వెళ్లే రోడ్డు పనులు మధ్యలో ఆగాయి. ఇది పూర్తయితే జగిత్యాలకు వెళ్లే వారికి రోడ్డు మార్గం దగ్గరవుతుంది. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇటీవల చందుర్తికి వచ్చినప్పుడు ఈ రోడ్డును పూర్తి చేయిస్తానని చెప్పారు.

– పులి గంగాధర, చందుర్తి

అటవీశాఖతో సంప్రదిస్తున్నాం

మానాల–మరిమడ్ల రోడ్డుకు తుది అనుమతి రావాల్సి ఉంది. అటవీశాఖకు నిధులు చెల్లించాం. మిగతా రోడ్లకు అనుమతి కోసం సంప్రదింపులు చేస్తున్నాం. ఆయా రోడ్లకు అటవీశాఖకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. దానికి సంబంధించిన నిధులు ఇప్పుడు అందుబాటులో లేవు. నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించాం.

– శ్యామ్‌సుందర్, ఆర్‌అండ్‌బీ ఈఈ, సిరిసిల్ల

జిల్లాలో వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలు

- ఎంట్రీ ఫీజు రూ.వెయ్యి
- జిల్లా యువజన, క్రీడల అధికారి అజ్మీరా రాందాస్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా క్రీడల అధికారి అజ్మీరా రాందాస్, డీపీఆర్వో దశరథం

సిరిసిల్ల: జిల్లాలో వాలీబాల్ చాంపియన్‌షిప్–2024 పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా యువజన, క్రీడల అధికారి అజ్మీరా రాందాస్ శనివారం తెలిపారు. కలెక్టరేట్‌లో పోటీల పోస్టర్లను డీపీఆర్వో ఎం.దశరథం, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశంతో కలిసి ఆవిష్కరించారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని ఆసక్తి గల యువతీ, యువకులు తమ జట్ల వివరాలను కలెక్టరేట్‌లోని యువజన, క్రీడా శాఖ అధికారి ఆఫీస్‌లో ఫిబ్రవరి 5లోగా అందించాలని సూచించారు. ఒక్కో టీమ్‌కు ఎంట్రీ ఫీజు రూ.వెయ్యి చెల్లించాలని, స్థానిక మినీస్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయని వివరించారు. విజేతలకు నగదు ప్రైజ్‌తోపాటు ట్రోఫీని కలెక్టర్, ఎస్పీల చేతుల మీదుగా అందిస్తామని తెలిపారు. జట్ల వివరాల నమోదుకు 94402 39783, 90594 65889, 75692 07411 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడ: వేములవాడలోని వ్యాపారులు తమ షాపుల ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ నాగేంద్రచారి కోరారు. దుకాణంతోపాటు రోడ్డు సైతం కవర్ అయ్యేలా సీసీ కెమెరా ఏర్పాటు చేసుకుంటే భక్తుల భద్రతకు సైతం తోడ్పడ్డవారవుతారని పేర్కొన్నారు. యాత్రస్థలం అయినందున వేములవాడకు అపరిచిత వ్యక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు, ఇతర అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించే అవకాశం ఉంటుందని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పబ్లిక్ సెక్యూరిటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సీసీఎస్ సీఐ బదిలీ

- చెన్నూర్ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్



రవీందర్

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల సీసీఎస్ సీఐగా విధుల్లో ఉన్న రవీందర్‌ను బదిలీ చేస్తూ ఐజీ తరుణ్ జోషి శనివారం రాత్రి ఉత్తర్వులు వెల్లడించారు. చెన్నూర్ సీఐగా విధులు కేటాయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు



జాతర ఏర్పాట్లపై సమీక్షిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, అధికారులు

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- మాఘ అమావాస్య ఏర్పాట్లపై సమీక్ష

వేములవాడ: రాజన్న ఆలయ దత్తత గుడి మామిడిపల్లి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఫిబ్రవరి 9న జరిగే మాఘ అమావాస్య జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అధికారులకు సూచించారు. ఆలయ చైర్మన్ చాంబర్‌లో ఆమె వివిధ శాఖల అధికారులతో శనివారం ప్రత్యేక సమావేశమయ్యారు. అరుణ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తుల భద్రత విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. పారిశుద్ధ్య పనులు, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, లైటింగ్‌పై అధికారుల బృందం ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సూచించారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఆర్డీవో మధుసూదన్, ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, ఏఈవో శ్రీనివాస్, సెస్ వైస్‌చైర్మన్ తిరుపతి, మామిడిపల్లి సర్పంచ్ కొక్కుల భారత, ఎంపీడీవో రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, కోనరావుపేట ఎంపీపీ చంద్రయ్యగౌడ్, ఆలయ సూపరింటెండెంట్ శ్రీరాములు, ఆలయ ఇన్‌చార్జి నరేందర్, అర్చకులు తీరున హరికృష్ణ, లక్ష్మణ్, జూనియర్ అసిస్టెంట్ దేవయ్య, కమలాకర్ పాల్గొన్నారు.

నేతన్నలకు నిరంతర ఉపాధి

- ప్రభుత్వ ఆర్డర్లు ఇస్తాం
- సిరిసిల్ల కాంగ్రెస్ నేతలకు మంత్రి తుమ్మల హామీ

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల నేతకార్మికులకు నిరంతరం పని కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్థానిక నేతలకు హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో శనివారం మంత్రి తుమ్మలతోపాటు చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ అలగు వర్షిణిని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ తదితరులు కలిశారు. గత ప్రభుత్వం తప్పిదంతో సిరిసిల్ల వస్త్రపరిశ్రమ అప్పుల్లో కూరుకుపోయిందని, బతుకమ్మ చీరల ఆర్డర్ల బకాయిలు రూ.260కోట్లకు పైగా పేరుకుపోయాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కొత్తగా ప్రభుత్వ ఆర్డర్లు ఇచ్చి నేతకార్మికులకు పని కల్పించాలని విన్నవించారు.



మంత్రి తుమ్మల, టెక్స్‌టైల్ ఏడీలకు పుష్పగుచ్ఛం ఇస్తున్న చొప్పదండి ప్రకాశ్, కేకే మహేందర్‌రెడ్డి

మంత్రి తుమ్మల స్పందిస్తూ సిరిసిల్ల నేతకార్మికులకు ఉపాధి, వస్త్రపరిశ్రమ అంశాలను వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వం నుంచి పోలీస్, వైద్యారోగ్య శాఖలకు చెందిన ఆర్డర్లు ఇస్తామని హామీ ఇచ్చారు. వర్కర్ టు ఓనర్ పథకాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈఏడాదికి బతుకమ్మ చీరల ఆర్డర్లను ఇచ్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని స్పష్టం చేశారు.

సీఎంతో ఆది శ్రీనివాస్ భేటీ

- రాజన్న సిరిసిల్ల జిల్లా సమస్యలపై వినతి
- త్వరలో వీటీడీఏ సమావేశానికి నిర్ణయం
- సానుకూలంగా స్పందించిన రేవంత్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల/వేములవాడ: జిల్లాలోని ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందించారు. సీఎంపాటు రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క, సీఎం ప్రత్యేక సలహాదారులు వేం నరేందర్‌రెడ్డితో ఆది శ్రీనివాస్ భేటీ అయ్యారు. జిల్లాలోని సాగునీటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. జగిత్యాల జిల్లా పరిధిలోని కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండల ప్రజల తాగు, సాగునీటికి ఉపయోగపడే కలికోట సూరమ్మ చెరువు కుడి, ఎడమ కాలువల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని కోరారు. వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్ చెరువు, కోనరావుపేట మండలం లచ్చంపేట చెరువులను రిజర్వాయర్లుగా మార్చేందుకు నిధులు విడుదల చేయాలని కోరారు. భీమారం మండలం గోవిందారం చెరువులోకి పోతారం రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని విడుదల చేయాలని, కాళేశ్వరం ప్రాజెక్టు–9వ ప్యాకేజీ పనులు ప్రారంభించాల్సిందిగా కోరారు. వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం డిగ్రీ కళాశాలలో బాలికల హాస్టల్, మిడ్‌మానేరు నిర్వాసిత యువతకు ఉపాధి అవకాశాలు, పునరావాస కాలనీల్లో కుటీర పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలని కోరారు.

వేములవాడ ఆలయ అభివృద్ధిపై

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థాన అభివృద్ధి, వేములవాడ పట్టణంలో జరిగే అభివృద్ధి, వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీటీడీఏ) పరిధిలో జరిగే పనులకు నిధులు విడుదల చేయాలని కోరారు. సీఎం సమక్షంలో వీటీడీఏ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని విన్నవించారు. జిల్లా సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు.



లక్ష పుష్పార్చన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వాసవి మాత కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శనివారం లక్ష పుష్పార్చన నిర్వహించారు. హల్దీపూర్ వామనాశ్రమ మహాస్వామిజీ వైశ్యగురు మఠం ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గుండ చిన్నమల్లేశం, బొమ్మకంటి రాజేశం, బచ్చు అశోక్, గంప నాగేందర్, బొమ్మకంటి భాస్కర్, చకిలం మధు, రేపూరి లక్ష్మీనారాయణ, బచ్చు శ్రీను, చింత రాజు, బొమ్మకంటి రాజయ్య, తాటిపెల్లి సుధాకర్ పాల్గొన్నారు.

బోయినపల్లి ఎంపీపీపై అవిశ్వాసం



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న ఎంపీటీసీలు

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ ఆరుగురు ఎంపీటీసీలు శనివారం వేములవాడ ఆర్డీవో మధుసూదన్‌కు వినతిపత్రం అందించారు. వైస్ ఎంపీపీ నాగయ్య, అనంతపల్లి, వరదవెల్లి, తడగొండ, మల్లాపూర్, కోరెం ఎంపీటీసీలు ఉన్నారు.

క్లుప్తంగా

నకిలీ వీసాలతో మోసం

- సుమారు 60 మంది నుంచి డబ్బులు వసూలు
- బాధితుల ఆందోళన.. పోలీసులకు ఫిర్యాదు

మెట్‌పల్లి: దుబాయ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ఓ వ్యక్తి నకిలీ వీసాలు అంటగట్టి మోసం చేసిన సంఘటన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. పట్టణంలోని చైతన్యనగర్‌కు చెందిన ఏలేటి రమేశ్ కొంతకాలంగా దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆ దేశంలోని బిన్ బెలాయిలా కాంట్రాక్టింగ్ కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని అక్కడి నుంచి బంధువులకు, స్నేహితులకు సమాచారం ఇచ్చాడు. వారి ద్వారా నిర్మల్, నిజామాబాద్, మెట్‌పల్లి ప్రాంతాలకు చెందిన సుమారు 60 మంది నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.26,500ను వసూలు చేశాడు. ఆ తర్వాత వీసాలు పంపకుండా జాప్యం చేస్తూ వస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం మెట్‌పల్లికి వచ్చిన అతన్ని డబ్బులు ఇచ్చిన వారంతా కలిసి వీసాల గురించి ప్రశ్నించగా, తొందరలోనే వస్తాయని నమ్మబలికాడు. రోజులు గడుస్తున్నప్పటికీ రాకపోవడంతో అందరూ కలిసి గట్టిగా నిలదీశారు. ఈ నెల 26న పంపిస్తానని చెప్పడంతో వారంతా ఒక్కొక్కరు రూ.20 నుంచి రూ.28వేల వరకు వెచ్చించి విమాన టిక్కెట్లు తీసుకున్నారు. అనంతరం రమేశ్ ఇచ్చిన వీసాలతో శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లగా, అక్కడి అధికారులు వాటిని పరిశీలించి నకిలీవని తేల్చి చెప్పారు. ఖంగుతిన్న బాధితులంతా శనివారం మెట్‌పల్లిలోని అతని ఇంటి వద్దకు రాగా, అందుబాటులో లేకుండా పోయాడు. ఫోన్‌లో కూడా స్పందించకపోవడంతో అక్కడే ఆందోళనకు దిగారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. రమేశ్ మోసం వల్ల ఒక్కొక్కరు రూ.60 వేల వరకు నష్టపోయామని, తమకు న్యాయం చేయాలని ఎస్సై చిరంజీవిని కోరారు.



రాజన్నా దీవించు

వేములవాడ: సమ్మక్క జాతర సమీపిస్తుండడంతోపాటు వీకెండ్, వరుస సెలవులు రావడంతో శనివారం వేములవాడ రాజన్నను 25వేల మంది భక్తులు దర్శించుకున్నారు. రాజన్న క్షేత్రం రద్దీగా మారింది. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు తడి బట్టలతో కోడెమొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.35 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏర్పాట్లను ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్, శ్రీరాములు పరిశీలించారు.

ఆవేదన దించుకోవాలె.. జనంతో పంచుకోవాలె!

- 'పెద్దింటి' కథలు.. వలస కన్నీళ్లు
- పల్లె ఆత్మ కథల్లో ఆవిష్కరణ
- కదిలించిన కరువు, కూలిపోతున్న కులవృత్తులు
- కథకుడు, మాటలు, పాటల రచయిత అశోక్‌కుమార్ సాహిత్య ప్రస్థానం



అశోక్‌కుమార్

సాక్షి, కరీంనగర్ డెస్క్: ఆయన కథలు చదువుతుంటే మట్టి వాసన పరిమళిస్తుంది.. పల్లెల ముఖచిత్రం కళ్లముందు మెదులుతుంది.. మనసును కథలోకి లాక్కెళ్తాడు.. గుండెను పిండేసి కన్నీరు పెట్టిస్తాడు.. మానవ విలువలను రంగరించి రుచిచూపిస్తాడు. నవలంటే జీవితం.. ఓ తరం చరిత్ర, వికాసం, అభివృద్ధి. అలాంటి నవలా ప్రపంచంలో కొత్త చరిత్రను రాసినవాడు పెద్దింటి అశోక్‌కుమార్. రాజన్న సిరిసిల్ల జిల్లా భీముని మల్లారెడ్డిపేట స్వస్థలం. ఐదు దశాబ్దాల తెలంగాణ చరిత్రను తన ఐదు నవలల్లో ఆవిష్కరించారు. భాషాసంస్కృతుల మీద దృష్టిపెట్టి, పల్లె జీవితాన్ని, ఆచార వ్యవహారాలను చిత్రించారు. ఆయన రాసిన 'జిగిరి' నవల 12 భారతీయ భాషల్లోకి అనువాదమైంది. అశోక్‌కుమార్ 250 వరకు కథలు, 9 నవలలు, 8 కథాసంపుటిలు, 6 నాటికలు, 100 వరకు సామాజిక వ్యాసాలు రాశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, పాఠ్యాంశాల రూపశిల్పిగా, కథకుడిగా, మాటలు, పాటల రచయితగా ప్రసిద్ధి చెందారు. పెద్దింటి అశోక్‌కుమార్ సాహిత్యానికి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా పలకరించగా చెప్పిన పలు విషయాలు ఆయన మాటల్లోనే..

- నేను 1968 ఫిబ్రవరి 6న గంభీరావుపేట మండలం భీమునిమల్లారెడ్డిపేటలో పుట్టాను. అమ్మానాన్న మల్లవ్వ, అంజయ్య. మాది రెండెకరాల పేద కుటుంబం. నా ప్రాథమిక విద్య మా ఊరిలోనే సాగింది. ఉన్నత విద్య మా పక్క ఊరు లింగన్నపేటలో చదివాను. ఇంటర్ గంభీరావుపేటలో చేశాను. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు, శ్రీకష్ణ దేవరాయ విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ(గణితం), ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఈడీ పూర్తి చేసి, 1996లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా మా పక్క ఊరు కోరుట్లపేటలో జాయిన్ అయ్యాను. మా ఊరి నుంచే బడికి వెళ్లేవాడిని.
- అప్పట్లో కరువు పరిస్థితులు, వలసలు, ప్రపంచీకరణ, కూలిపోతున్న కులవత్తులు నన్ను కదిలించాయి. నా చిన్నప్పుడే మా నాన్న బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లాడు. అప్పట్లో ఉత్తరం



పుస్తకాల ముఖచిత్రాలు

వచ్చేందుకు నెలలు పట్టేది. మా సమీప బంధువులు చాలా మంది గల్ఫ్ దేశాలకు వెళ్లారు. అలా నేను ఒక రకంగా వలస కుటుంబాలు కష్టాలను, కన్నీళ్లను దగ్గరి నుంచి చూశాను. అవే కథావస్తువులు అయ్యాయి.

- 1999లో రచనా రంగంలోకి వచ్చాను. 'ఆశ.. నిరాశ.. ఆశ' నా తొలిరచన. అది అప్పట్లో ఓ ప్రముఖ దినపత్రికలో ప్రచురితమైంది. తెలంగాణ యాసను, భాషను, సామెతలను ఆవిష్కరిస్తూ.. అనేక కథలు రాశాను. తెలంగాణ అంటేనే వలసలకు నిర్వచనం. అవి ఉత్తర తెలంగాణలో మరీ ఎక్కువ. ఆ వలస వెనుక విషాదం దాగి ఉంటుంది. కన్నీళ్లు పొంగుతాయి. వలసలోని వికత రూపాలను 2001లో 'ఎడారి మంటలు'గా చిత్రించాను. దేశం కాని దేశంలో భాషరాని రాజ్యంలో తెలంగాణ బిడ్డలు పడుతున్న బాధలు.. కొడుకులు దూర దేశంలో ఉంటే ఇక్కడ తల్లులు పడుతున్న తండ్లాట రాశాను.
- గ్రామీణ పర్యావరణాన్ని అంశంగా తీసుకొని 'దాడి' నవల రాశాను. వ్యవసాయం ఏతం, మోట, రాటు, డీజిల్ ఇంజిన్లను దాటుకొని హైస్పీడ్ మోటార్లు, సబ్‌మెర్సిబుల్ పంపులదాకా వచ్చింది. ఫలితంగా దోసెడు మట్టిని తీస్తే దోసెడు నీళ్లూరే భూములు నీళ్లు లేక ఎండిపోయాయి. అడవులు నాశనమైపోయాయి. ఇప్పుడే ఇలా ఉంటే భవిష్యత్ తరాలకు నీరు ఎలా అందుతుందన్న ప్రశ్నను ముందుంచుతూ 'దాడి'ని రాశాను.
- జంతులక్షణాలు ఉన్న మనిషికి.. మనిషి లక్షణాలు ఉన్న జంతువుకు మధ్య సంఘర్షణే 'జిగిరి' నవల. ఆకాశవాణిలో ప్రసారమైంది. ఇలా ఇప్పటివరకు నవలలుగా ఎడారి మంటలు (2002), దాడి (2005), జిగిరి (2006), ఊరికి ఉప్పులం (2007), సంచారిని (2011), మిలియన్ మార్చ్ (2017), ఇంకెంత దూరం (2020) రాశాను. కథా సంపుటాలుగా ఊటబాయి (2003), వలస బతుకులు (2004),



రామాజీపేట స్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా అశోక్‌కుమార్ ఊరి జనం ముందు రెఫరెండం (ఫైల్)

మా ఊరి బాగోతం (2005), మాయిముంత (2007), భూమడు (2009), పోరుగడ్డ (2011), జుమ్మేకి రాత్‌మే (2015), గుండెలో వాన (2021) ప్రచురితమయ్యాయి. ఎండమావి (2005), పోరుగడ్డ (2016), తెగారం (2018), నెనరు (2021) నాటకాలుగా ఆకాశవాణిలో ప్రసారమయ్యాయి. తెగారం నాటకానికి నటనలో నంది అవార్డు సహా పాతిక అవార్డులు వచ్చాయి. నేను రాసిన మరో 25 కథలు హిందీలోకి అనువాదం అయ్యాయి.

- కథా రచయితగా ఉన్న నేను తొలిసారి 2010లో వేదం సినిమాకు మాటలు రాశాను. ఆ సినిమా నిర్మాత క్రిష్ నన్ను పిలిచి, తెలంగాణ మాండలికం పోర్షన్‌కు మాటలు రాయించారు. ఆ సినిమాలోని ఓ పాత్రకు నేను 'సిరిసిల్ల రాజయ్య'అనే పేరు పెట్టాను. అలా 'దాగుడు మూతలు దండాకోర్', 'మల్లేశం', 'దొరసాని', 'తమసోమ జ్యోతిర్గమయ', 'షరతులు వర్తిస్తాయి' వంటి సినిమాలకు పని చేశాను. పలు సినిమాల్లో పాటలు రాశాను. నటించాను కూడా. నేను రాసిన జిగిరి నవల సినిమాగా రాబోతుంది. ఇప్పటికే నా 'ఊటబాయి' కథను అదేపేరుతో పాలసాని వేణు చిన్న సినిమాగా తీశారు. టీవీ సీరియల్‌గా కూడా కొన్ని కథలు బుల్లితెరకెక్కాయి. ఇంకా కొన్ని సినిమాలకు కమిట్‌మెంట్ కుదిరింది.
- నేను రాసిన 8 కథలు వివిధ విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలయ్యాయి. కాకతీయ వర్సిటీ ఎంఏ తెలుగు విభాగం విద్యార్థులకు 'మాయిముంత', 'ఇగురం' కథలు పాఠ్యాంశాలుగా మారాయి. ఉస్మానియా వర్సిటీ 'జిగిరి', నవలను, 'గోస' కథను 'లాంగ్ మార్చ్' నవలను పాఠ్యాంశంగా చేర్చారు. దక్షిణ భారతీయ భాషా అధ్యయన కేంద్రం మైసూర్ వారు తెలుగు విద్యార్థులకు 'అనగనగా ఓ కోడి పెట్ట' కథను పాఠ్యాంశం చేశారు. నాగార్జున వర్సిటీ పరిధిలోని సిల్వర్ జూబ్లీ కళాశాల విద్యార్థులకు రైతు జీవితం నేపథ్యంలో రాసిన 'గుండెలోన వాన' కథను బోధిస్తున్నారు. ఓరియంటల్ కాలేజీ పీడీసీలో జిగిరి నవల పాఠ్యాంశమైంది. నా సాహిత్యంపై ఆరుగురు పరిశోధనలు, ఆరుగురు ఎంఫిల్ చేశారు. విచిత్రంగా నేను తెలుగుపై పీహెచ్‌డీ చేస్తుండగా.. నా జిగిరి నవల గురించి నాకే ప్రశ్న వచ్చింది. తెలుగు మహాసభల్లో అప్పటి సీఎం కేసీఆర్ నా సాహిత్య శైలిని ప్రస్తావించడం సంతోషమనిపించింది.
- నేను గవర్నమెంట్ టీచర్‌గా పని చేస్తూ.. బండలింగంపల్లిలో 'గుండ్ల చెరువు' పేరుతో స్కూల్ మ్యాగజైన్‌ను నడిపించాను. రామాజీపేటలో మా పనితీరుపై ఆ ఊరి ప్రజల ముందు రెఫరెండం పెట్టాను. ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలన్న వారి కోరికను నెరవేర్చుతూ బోధనలో మార్పులు తెచ్చాం. సర్కారు బడిని బతికించాలన్న ఉద్దేశంతో 12 లఘుచిత్రాలు తీశాను.
- మా ఊరే నన్ను కథకుడిని చేసింది. ఎండిన వాగులు.. కరిగిపోయిన కొండలు.. మొరం తేలిన వాకిళ్లు.. గల్ఫ్ దేశాలకు వలసలు.. నన్ను కదిలించాయి. నా గుండెను పిండేసిన సంఘటనలు.. బాధలు.. నా మనసులోని బరువు దించుకోడానికి నేను కథలు రాశాను. అవి కథలు కాదు.. వాస్తవిక ఘటనలకు సజీవ సాక్ష్యాలు.. నేను ఇంకా రాస్తూనే ఉంటాను. నా ఈ సాహిత్య ప్రయాణంలో నా భార్య మంజుల, కూతుళ్లు సాహితి, సతి సహకారం మరువలేనిది. కథకుడిగా ఇప్పటికి 25 ఏళ్లవుతోంది. 11 కథలతో 'విత్తనం' అనే కథల సంపుటి రాబోతుంది.

ముంపు బాధితులను ఆదుకోవాలి



నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధిత రైతులు

ముస్తాబాద్(సిరిసిల్ల): చెరువులో పట్టా భూములు కోల్పోతున్న తమను ఆదుకోవాలని రైతులు ముస్తాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు. మండలంలోని చీకోడుకు చెందిన చింతల చెరువు ముంపు బాధిత రైతులు ధర్నా చేపట్టి మాట్లాడారు. నాలుగేళ్లుగా చింతల చెరువులోకి మల్లన్నసాగర్ నీరు విడుదల చేయడంతో 110 ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టా భూములు నీటిలో మునిగిపోవడంతో పంటలు సాగు చేయడం లేదన్నారు. చెరువు నీటిలో భూములు పోవడంతో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. భూమికి బదులు భూమి ఇప్పించాలని, లేదా మల్లన్నసాగర్ నీటి విడుదలను ఆపాలని కోరారు. ఈమేరకు నాయబ్ తహసీల్దార్ సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులు కాంపెల్లి శ్రీనివాస్, రాజిరెడ్డి, నర్సయ్య, నాంపెల్లి, పోశరాములు, విజయ, ఎల్లం, రమేశ్, చందు, రాజశేఖర్, ఎల్లయ్య, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ గణిత పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ ప్రసాదరావు

కొత్తపల్లి(కరీంనగర్): సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే ఆర్యభట్ట గణిత చాలెంజ్ పోటీల్లో కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ రితేశ్ మెహతా తెలిపారు. లెవల్–1, 2ల్లో నిర్వహించిన పరీక్షకు దేశవ్యాప్తంగా రూ.5.50 లక్షల మంది హాజరయ్యారని అన్నారు. ప్రతీ రీజియన్‌లో 100 మందిని ఎంపిక చేయగా వారిలో జిల్లా నుంచి నలుగురికి చోటు దక్కిందని పేర్కొన్నారు. వీరిలో ముగ్గురు పారమిత విద్యార్థులుండటం గర్వంగా ఉందన్నారు. ఈ మేరకు పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు సీహెచ్.లక్ష్మీహాసని, జి.హరికాంత్, బి.విశాల్‌రెడ్డిలను విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు అభినందించారు. డైరెక్టర్లు అనూకర్‌రావు, రశ్మిత, ప్రసూన, వినోద్‌రావు, వీయూఎం.ప్రసాద్, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, గైడ్ టీచర్ సంపత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలస్యంగా నడుస్తున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు

రామగుండం: న్యూఢిల్లీ నుంచి చెన్నై మార్గంలో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల గంటల కొద్దీ ఆలస్యంగా నడిచాయి. ప్రధానంగా శనివారం రామగుండం చేరుకోవాల్సిన పలు రైళ్లు దాదాపు 12 గంటలకుపైగా ఆలస్యంతో వచ్చాయి. దీంతో ప్రయాణికుల పర్యటన షెడ్యూల్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. గంటల కొద్దీ నిరీక్షించాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. న్యూఢిల్లీలో దట్టమైన పొగమంచుతో రాత్రి, వేకువజామున బయలుదేరే రైళ్లు మధ్యాహ్నం వేళ బయలు దేరుతున్నాయి. దీంతో రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని రైల్వే అధికారులు తెలిపారు.

రామగుండం చేరుకునే రైళ్ల సమయం ఇలా..

- రైలు నంబరు 12511 కొచ్చువెల్లి –రఫ్తిసాగర్ రామగుండం ఉదయం 9.25గంటలకు రావాల్సి ఉండగా 7.30 గంటల ఆలస్యంగా సాయంత్రం 4గంటలకు చేరుకుంది.
- రైలు నంబరు 20806 న్యూఢిల్లీ–విశాఖపట్నం ఏపీ ఎక్స్‌ప్రెస్ రామగుండం మధ్యాహ్నం 3.49 గంటలకు రావాల్సి ఉండగా 12 గంటల ఆలస్యంతో ఆదివారం వేకువజాము 3.31 గంటలకు రానుంది.
- రైలు నంబరు.12616 న్యూఢిల్లీ–చెన్నై జీటీ ఎక్స్‌ప్రెస్ రామగుండం సాయంత్రం 4.09గంటలకు రావాల్సి ఉండగా పది గంటల ఆలస్యంగా ఆదివారం వేకువజామున 2.10గంటలకు చేరుకుంటుంది.
- రైలు నంబరు 12626 న్యూఢిల్లీ–త్రివేంద్రం కేరళ ఎక్స్‌ప్రెస్ రామగుండం సాయంత్రం 4.59 గంటలకు రావాల్సి ఉండగా 15 గంటల ఆలస్యంతో ఆదివారం ఉదయం 7.42 గంటలకు రానుంది.
- రైలు నంబరు 12724 న్యూఢిల్లీ–హైదరాబాద్ తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రామగుండం మధ్యాహ్నం 12.31గంటలకు రావాల్సి ఉండగా 12 గంటల ఆలస్యంతో అర్ధరాత్రి ఒంటి గంటకు రానుంది.



తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు

దోపిడీకి పాల్పడిన ఇద్దరి అరెస్ట్

- సీసీ పుటేజీ ఆధారంగా పట్టివేత

సిరిసిల్లక్రైం: ఒంటరిగా వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకొని దోపిడీకి పాల్పడుతున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం తెలిపారు. సీసీ నిందితులను పట్టుకున్న సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బంది నరేందర్, రాజశేఖర్, శ్రీనివాస్, అక్షర్‌లకు రివార్డులు అందించారు. ఎస్పీ తెలిపిన వివరాలు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన రుద్రాపు పోషవ్వ అనారోగ్యంతో ఉండగా చికిత్స కోసం జిల్లెల్ల క్రాసింగ్ వద్ద ఉన్న ఆర్ఎంపీ వద్దకు ఈనెల 12న వెళ్లి ఇంటికి తిరిగి వస్తుంది. గమనించిన ఓ మహిళ, మరో పురుషుడు బైక్‌పై వచ్చి వృద్ధురాలి ఇంటి వద్ద దిగబెడతామని బైక్ ఎక్కించుకున్నారు. ఇంటి వద్ద దించే క్రమంలో వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడును తెంపుకొని పరారయ్యారు. బాధితురాలు తంగళ్లపల్లి ఠాణాలో ఫిర్యాదు చేసింది. సీఐ, ఆర్ఎస్సైలు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈనెల 26న బద్దెనపల్లి క్రాసింగ్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. సిద్దిపేట జిల్లాకు చెందిన సిద్ధ యాదవ్వ, బోదాసు నరేశ్‌లు ఈ దోపిడీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు.



ఎస్పీ అఖిల్ మహాజన్ చేతుల మీదుగా రివార్డు అందుకుంటున్న సీఐ సదన్‌కుమార్, సిబ్బంది

జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపిక



కరీంనగర్ స్పోర్ట్స్: కడప జిల్లాలోని రాయపూర్‌లో ఈ నెల 28 నుంచి 31 వరకు 67వ జాతీయ స్థాయి కబడ్డీ అండర్–14 బాలికల చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు కరీంనగర్‌లోని పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థిని కృతిక ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. ఇటీవల జనగాంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. పారమిత పాఠశాలల అధినేత ఇనుగంటి ప్రసాదరావు శనివారం ఆమెను అభినందించారు.

జాతీయ బేస్‌బాల్ పోటీలకు..



కరీంనగర్‌స్పోర్ట్స్: చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని కోర్బాలో ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు 67వ జాతీయస్థాయి అండర్–14 బేస్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు కరీంనగర్ మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థి అక్షయ్ కార్తీక్ ఎంపికయ్యాడు. ఇటీవల తొర్రూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా విద్యార్థిని మానేరు విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డి శనివారం అభినందించారు.

స్కూల్ ప్రిన్సిపాల్ అదృశ్యం



ఆనంద్

కరీంనగర్‌క్రైం: ఓ ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మంకమ్మతోటలోని వాసముండే కమలాకర ఆనంద్ తిమ్మాపూర్‌లోని తన స్నేహితుడి వద్ద కు డబ్బుల కోసం వెళ్తున్నానని శుక్రవారం ఇంట్లో చెప్పి, వెళ్లాడు. కానీ, తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతని భార్య సుశ్మిత శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

మంచం పట్టిన పదిర

- నెల రోజులుగా వీడని జ్వరాలు
- గ్రామంలో మెగా వైద్యశిబిరం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని పదిర గ్రామస్తులు నెల రోజులుగా జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నా జ్వరాలు తగ్గడం లేదు. ఇంటికొకరి చొప్పున జ్వరపీడితులు ఉన్నారు. ఈ విషయమై జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావుకు ఫిర్యాదు అందగా వెంటనే స్పందించారు. గ్రామంలో మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేసి తక్షణం వైద్యం అందించాలని ఆదేశించారు. వెంటనే వైద్యాధికారులు శనివారం పదిర గ్రామంలో పర్యటించారు. ఇంటింటికెళ్లి వివరాలు సేకరించి వైద్యసేవలు అందించారు. జిల్లా సబ్‌యూనిట్ అధికారి మోహన్, మండల ఇన్‌చార్జి వైద్యాధికారి చిరంజీవి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఇంటింటికి తిరిగి జ్వరాలతో బాధపడుతున్న రోగుల వివరాలు సేకరించి వైద్యసేవలందిస్తున్నారు. జ్వరం తీవ్రంగా ఉన్న వారిని సిరిసిల్ల ఏరియాస్పత్రికి తరలించారు. డ్రెయినేజీల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేశారు. వైద్య సిబ్బంది నరేందర్, రమేశ్, పద్మ, స్వప్నదేవి, అనసూయ, లక్ష్మీప్రసన్న, పద్మ, మౌనిక, లత, సర్పంచ్ కుంబాల వజ్రమ్మ, పంచాయతీ కార్యదర్శి సాగరిక, కారోబార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



యాకూబ్ పాషా (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని గడిమహిల్‌కు చెందిన ఎండీ యాకూబ్‌పాషా(రాహిల్)(33) శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఎస్సై విజేందర్, కుటుంబసభ్యుల కథనం ప్రకారం యాకూబ్‌పాషా స్థానికంగా సెల్ రిపేర్ సెంటర్ నడిపిస్తూ జీవిస్తున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తాయి. వీటిని అధిగమించలేక మానసికంగా కృంగిపోయాడు. తీవ్ర మనస్తాపంతో ఈక్రమంలో ఈనెల 5న గడ్డిమందు తాగాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి చెల్లెలు నిషాత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య ఉంది. ఆమె తొమ్మిది నెలల గర్భిణీ అని కుటుంబ సభ్యులు తెలిపారు.

భార్యను వేధించిన భర్తకు ఐదేళ్ల జైలు

కరీంనగర్ క్రైం: అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేయడంతోపాటు అత్తంటివారు ఉంటున్న గుడిసెను తగులబెట్టిన కేసులో చెక్కల శివకృష్ణకు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.30 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఫ్యామిలీ కోర్టు జడ్జి లక్ష్మీకుమారి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహాత్మానగర్ చాపల కాలనీకి చెందిన దివ్య అదే కాలనీకి చెందిన చెక్కల శివకృష్ణ ఐదేళ్ల క్రితం ప్రేమించి, పెళ్లి చేసుకున్నారు. మూడేళ్ల భార్యతో కలిసి కాపురం చేసిన శివకృష్ణ తర్వాత రూ.5 లక్షల అదనపు కట్నం తీసుకురావాలంటూ ఆమె వేధింపులకు గురిచేశాడు. దీనిపై పంచాయితీ పెట్టగా భార్యను మంచిగా చూసుకుంటానని చెప్పాడు. కొన్ని రోజుల తర్వాత తిరిగి వేధించడం ప్రారంభించాడు. 2022 అక్టోబర్ 10న రాత్రి శివకృష్ణ అత్తామామ ఉండే గుడిసెను తగులబెట్టాడు. ఈ ఘటనపై దివ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్ఎండీ పోలీసులు శివకృష్ణపై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరిపారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలూరు శ్రీరాములు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి సాక్ష్యాధారాలు పరిశీలించి, శివకృష్ణకు శనివారం జైలుశిక్ష, జరిమానా విధించారు.

నర్సింగ్ కోర్సు అభ్యర్థులకు జపాన్‌లో ఉద్యోగాలు

- టాంకాం ద్వారా ఎంపిక
- రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షలు వేతనం
- జనవరి 29న స్క్రీనింగ్ పరీక్షలు
- జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్

సిరిసిల్ల: నర్సింగ్ కోర్సులను పూర్తి చేసిన అభ్యర్థులకు జపాన్‌లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్ శనివారం తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టీవోఎంసీవోఎం) ద్వారా రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తాజాగా బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం డిప్లొమా హెల్పర్స్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని వివరించారు. టాంకాం ద్వారా గతంలో రెండు బ్యాచ్‌ల్లో 31 మందికి జపాన్‌లో ఉపాధి అవకాశాలు కల్పించిందని, మూడో బ్యాచ్ ఎంపికకు జనవరి 29న హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్ ట్రెయినింగ్ (ఎన్ఎస్‌టీఐ)లో ఉదయం 10 గంటల నుంచి స్క్రీనింగ్ పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు జపనీస్ భాషపై, అదనపు వృత్తిపరమైన నైపుణ్యాన్ని రెసిడెన్షియల్ శిక్షణను హైదరాబాద్‌లోనే ఇస్తారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు నెలకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు సంపాదించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. పూర్తి వివరాల కోసం 89190 47600, 63022 92450, 95739 45684 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాజకీయాల్లో శత్రువులుగా ఉండొద్దు

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం



బ్యాడ్మింటన్ ఆడుతున్న వినోద్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్: రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉండాలి గానీ శత్రువులుగా ఉండొద్దని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో కరీంనగర్ క్లబ్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని, మాట్లాడారు. గెలుపోటములను సమానంగా స్వీకరించిన్నప్పుడే క్రీడల్లో రాణిస్తారని, రాజకీయ నాయకులు కూడా గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న కాలంలో అథ్లెటిక్స్ క్రీడాకారుల కోసం రూ.7 కోట్లతో సింథటిక్ ట్రాక్ నిర్మించినట్లు చెప్పారు. అనంతరం బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను సత్కరించారు. సంఘం బాధ్యులు జితేందర్ రెడ్డి, అదనపు ఎస్పీ వెంకట్రావు, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా, శంకరపట్నం జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, సినీ నటుడు ప్రభాస్ శ్రీను, శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ రమేశ్‌రెడ్డి, డీఎస్పీ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

5 కేజీల గంజాయి స్వాధీనం

- నిందితులు హుజూరాబాద్‌వాసులు



గంజాయి, నిందితుడితో ఏసీపీ హరికృష్ణ

ఖమ్మం క్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు శనివారం 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఓ యువకుడు, ఇద్దరు మైనర్లు వెళ్తుండగా వారి బ్యాగ్‌లు పరిశీలించారు. అందులో గంజాయి లభించడంతో అదుపులోకి తీసుకున్నారు. హుజూరాబాద్‌కు చెందిన నీలం రాజు ఇద్దరు మైనర్లతో కలిసి గంజాయి కొనుగోలు చేసి, హుజూరాబాద్ ప్రాంతంలో విక్రయించేందుకు వెళ్తూ పట్టుబడ్డారని ఖమ్మం టౌన్ ఏసీపీ హరికృష్ణ, సీఐ స్వామి వెల్లడించారు.